
# బళ్లూ ఓడలూ



"అట జని కాంచె భూమిసురు డంబరచుంబి శిరస్సజ్ఝరీ...." తెలుగు క్లాసులో అనర్గళంగా సాగుతుంది ఆషా గొంతు. సన్నగా, స్ఫుటంగా, స్థిరంగా. ఆశ్చర్యపోయాను. పద్యంలో ఎక్కడన్నా తప్పు దొర్లుతుందేమో అని పట్టి పట్టి వింటున్నాను. 'ముహుర్ముహుర్లుఠదభంగ తరంగ మృదంగ...' అన్న చోటైనా ఉచ్చారణ దోషం లేదు. ఆశ్చర్యంతోపాటు ఆనందం కూడా కలిగింది.

తెలుగు క్లాసంటే రెండు పద్యాలు పాడటమో, నాలుగు శృంగార సంగతులు చెప్పటమో కాదు నా దృష్టిలో. భాషంటే భాష చుట్టూ ఉన్న సంస్కృతే. తెలుగు చెప్పటమంటే మన చరిత్రను, సంస్కృతిని తవ్వి, తలపొయ్యటమనే అవగాహన నాది. అందుకే సామాజికాంశాలు, చారిత్ర

కాంశాలు, వర్తమాన ప్రాపంచిక విషయాల వెలుగులోనే పాఠం చెప్పటం అలవాటైంది నాకు. ఒక ఇంట్లోకి ప్రవేశించబోయే ముందు దాని చుట్టుపక్కలు ఎలా పరిశీలిస్తామో అలాగే ఒక రచన సమయ, సందర్భాలను పరిశీలించాలి. ఆ వాతావరణంలోకి విద్యార్థిని తీసుకెళ్లాలి. అందుకే ఆ పద్యానికి ముందు శ్రీకృష్ణదేవరాయల కాలం, ఉన్నత సామాజిక వర్గాల్లోని భోగలాలసత్వం, పెద్దన కవితామార్గం - ఇవన్నీ వివరిస్తూ పోయాను.

పాఠశాలల్లో గాని, కళాశాలల్లో గాని బోధన మొత్తం ఒకేదారి వ్యవహారం గదా! ఉపాధ్యాయుడు చెపుతాడు. విద్యార్థి వింటాడు. అంతే. ఆ పాఠంలో చెప్పే మనిషి నిమగ్నం అయ్యాడా? లేదా? తెలీదు. వినే మనస్సు అందులో లగ్నం అయిందా, లేదా? ఎవరికీ పట్టదు. అందుకే నేను కొన్ని కొత్త పద్ధతులు ఎంచుకొన్నాను. అందులో ఒకటి, విద్యార్థి చేతనే పాఠం కొంత చదివించటం. అతని ఆలోచనలు తెలుసుకోవటం నాకిష్టం. అందులో భాగంగానే ఇవాళ ఆషా ప్రవరుడి హిమాలయ సందర్శన చదవటం. తక్కిన వాళ్లు జంకుతున్నప్పుడు తను చదువుతానని ఆషాయే లేచింది. వ్యాఖ్యానం పూర్తయిన తర్వాత సందేహాలు అడుగమని చెప్పాను.

ప్రశ్నే జ్ఞానానికి తొలి మెట్టు. 'ఎందుకు అనే ప్రశ్న నేర్పినందుకు' గోపీచంద్ తన తండ్రి, హేతువాది త్రిపురనేని రామస్వామికి 'అసమర్థుని జీవయాత్ర' అంకితం చేశాడు.

"ఆ కవులు ఇటువంటి భాషను ఎందుకు వాడారు సార్!" అని ప్రశ్నించింది ఆషా.

ఆనాడు ప్రజలకు దూరమైన పండిత భాషాస్వభావం కాస్త వివరించాను. అప్పటి వాడుక భాష ఎలా ఉండేదో 'రాయవాచకం'లోని ఉదాహరణలు చెప్పాను. ఇంకో విద్యార్థి ఆ పద్యంలోని శబ్దాలంకారం గురించి అడిగాడు. లంచ్ టైంలో ఆ అమ్మాయిని పిలిపించాను, సన్నగా, తెల్లగా, పొడుగ్గా - అంతకు మించి అమాయకంగా ఉంది.

"నీ పేరు ఆశాలతా?"

"కాదు సార్! ఆషాయే."

ముస్లింల అమ్మాయి. నాకింకా ఆశ్చర్యం కలిగింది. అంత చక్కని ఉచ్చారణ ఎట్లా వచ్చింది? పైగా ప్రాచీన గ్రాంథిక భాషని అంత తేలిగ్గా ఎట్లా పట్టుకోగలిగింది?

"నీకు మొదటినుంచీ తెలుగంటే యిష్టమా?"

నవ్వుతూ తలూపింది. "బాగా యిష్టం సార్! అట్లాగే మాథ్స్ కూడా."

"మంచిది. నీ ఆసక్తిని బట్టి నా దగ్గర ఏ పుస్తకాలు కావాలన్నా తీసుకెళ్తుండు. బాగా చదవాలి" అన్నాను. తన కుటుంబ వివరాలు అడిగాను.

తండ్రి షేక్ బాషా. ఊరు సెంటర్‌లో మెకానిక్ షాపు. ఐదుగురు పిల్లల్లో నాలుగోది ఆషా. బీద కుటుంబం. పదోతరగతిలో బాగా మార్కులు వచ్చాయి. ఆపైన తండ్రి చదివించనన్నా పట్టుదలతో ఇంటర్‌లో చేరింది. తన ఫీజుకోసం ఎండాకాలం కుట్టుమిషను పనికూడా చేశానని

చెప్పింది. ఆషామీద నాకింకా అభిమానం ఏర్పడింది. నిజానికి ఈ గ్రామీణ విద్యార్థుల్లో నూటికి అరవై, డెబ్భైమంది ఒకేపు పొలం పనులు, వడ్రంగం, బేల్దారి లాంటి పనులు చేస్తూ చదువుకొనేవాళ్లే. అందుకే క్లాసులో వాళ్ల హాజరు తక్కువగా ఉంటుంది.

ఆషాను చూసి ఆ తర్వాత ఒకళ్లిద్దరు కుర్రాళ్లు కూడా పద్యాలు చదవటంలో ఉత్సాహం చూపించారు. వరూధినీ ప్రవరుల సంభాషణలో శృంగార పద్యాలు మాత్రం వాళ్లతో చదివించలేదు. సైన్స్ గ్రూపులో తనే అందరికన్న ముందుంటుంది. అయితే విద్యార్థుల సామర్థ్యానికి కేవలం మార్కులు కొలబద్ద కాదు. ఆగస్ట్ 15 సందర్భంగా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకి జరిగిన క్విజ్ పోటీలో తన తెలివితేటలు నాకు పూర్తిగా అర్థమయ్యాయి. విడిగా నా గదికి పిలిపించి మెచ్చుకొన్నాను. ఇంకా కృషి చెయ్యమని ప్రోత్సహించాను. యూనివర్సిటీలో మా ప్రొఫెసర్‌లు నన్ను అభినందించిన రోజులు గుర్తొచ్చాయి. మంచి ప్రోత్సాహం విద్యార్థిని చాలా పైకి తీసుకెళ్తుందని తెలుసు నాకు.

క్రమంగా ఆషా నా పెట్ స్టూడెంట్ అయ్యింది. అప్పుడప్పుడు రీసెస్‌లో తను మా డిపార్ట్‌మెంట్ రూంకి వచ్చి ఏవైనా కొన్ని గ్రామర్ పాయింట్స్ చెప్పించుకుంటుంది. కాలేజీలో పూర్ స్టూడెంట్స్ ఎయిడ్ నుంచి కొంత స్కాలర్‌షిప్ ఇప్పించాను. ఉండి ఉండి ఒకరోజు విడిగా నన్ను కలిసి, "క్లాసులో ఇద్దరు స్టూడెంట్స్ నన్ను 'వరూధిని' అంటున్నారు సార్! " అని విచారంగా చెప్పింది. ఆరోజు నేను ప్రిన్సిపల్ ఇన్-ఛార్జిని.

"వాళ్లని నేను మందలిస్తాలే, నువ్వేం బాధపడొద్దు" అని చెప్పి పంపించాను. మనుషుల పట్ల అగౌరవమే నిక్‌నేమ్స్‌కి కారణమని నా ఉద్దేశం. ఆ విద్యార్థుల్ని పిలిచి, ఆ సంగతి చెప్పి, చిన్న వార్నింగ్ ఇచ్చాను. అయితే 'వరూధిని' అనే మాట వినగానే నాకు రాజ్యలక్ష్మి గుర్తొచ్చింది.

❖ ❖ ❖

ఉద్యోగంలో చేరిన కొత్తరోజులు. పక్కనే ఊర్నుంచి కాలేజీకి రోజూ స్కూటర్ మీద ప్రయాణం. ఎమ్మేలో నేర్చుకున్నదంతా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకి చెప్పెయ్యాలనే తపన. చక్కని, వినసొంపైన భాషను ఉపయోగించాలనే ఆసక్తి, విద్యార్థులకి ఏ సమయంలోను విసుగు కలగకుండా మధ్య మధ్య చిన్న కథలతో, ఛలోక్తులతో పాఠం చెప్పాలనే ఆలోచన - ఎన్నో ఊహలు, ఉత్సాహాలు, ప్రయోగాలు. ఇంటర్ క్లాసులో ముప్ఫై అయిదు మంది విద్యార్థులు. తొమ్మిది మంది అమ్మాయిలు. లంగా, ఓణీల్లో ముద్ద బంతుల్లా. వాళ్లల్లో రాజ్యలక్ష్మి మరీ చక్కగా, వినయంగా ఉండేది. ఎప్పుడు వ్యాసరచన, వక్తృత్వంలాంటి పోటీలు జరిగినా కొన్ని పాయింట్స్ నాదగ్గర చెప్పించుకోటానికి లంచ్‌టైంలో నా దగ్గరికి వచ్చేది. తాగే సిగిరెట్టు అవతల పడేసి, జనరల్ నాలెడ్జి పాయింట్స్, కొన్ని కొటేషన్లు చెప్పేవాడిని. వయసును బట్టి ఏదో తెలీని రొమాంటిక్

ఆకర్షణ. అయితే ఉపాధ్యాయుడు - విద్యార్థి సంబంధం పట్ల నాకు కొన్ని నైతిక భావాలున్నాయి. కొన్నాళ్లకి సిగిరెట్ కూడా మానేశాను. అసలైన అధ్యాపకుడు విజ్ఞానం, వ్యక్తిత్వం - ఈ రెండు అంశాల్లో విద్యార్థులకి స్ఫూర్తినిస్తాడు.

రాజ్యలక్ష్మి బ్రాహ్మణుల పిల్ల. చదువులో చాలా చురుగ్గా ఉత్సాహంగా ఉండేది. తెలుగులో మాత్రం ఎప్పుడూ ఫస్ట్ లేదా సెకండ్ మార్కులు వస్తుండేవి. ఆ ముగ్గురమ్మాయిలు స్నేహితులే అయినా, ఊళ్లో నుంచి కాలేజీకి రోజూ కలిసి వచ్చేవాళ్లే అయినా చదువులో స్పర్థ ఉండేవి. ఒకళ్లకి ఫస్ట్ మార్క్ వస్తే మిగిలిన వాళ్లకి రోషం. ఒకసారి క్లాసులో చెప్పాను.

"స్పర్థ వల్ల విద్య వర్ధిల్లుతుందంటారు. అయితే అది అర్థసత్యమే. అనవసరమైన పోటీ తత్వం మానసిక అనారోగ్యానికి దారితీస్తుంది. నిజానికి ఈ ప్రపంచంలో ఎవరికి ఎవరూ పోటీ కాదు. ఎవరి కృషికి తగిన స్థానం వాళ్లకుంటుంది. ప్రపంచంలో తన స్థానం తాను గుర్తించటమే నిజమైన విద్య. అందుకని ఒకటి రెండు మార్కులు తగ్గినంత మాత్రాన, మనమో మరెవరో ఆశించిన ర్యాంకులు రానంత మాత్రాన ఏ మాత్రం నిరుత్సాహ పడనక్కర్లేదు."

అప్పుడప్పుడు టెక్స్ట్ బుక్‌లోని పద్యాలు, నోట్స్ లోని అంశాలు రాజ్యలక్ష్మి చదువుతుండేది క్లాసులో. అప్పుడే తనకి 'సత్యభామ' అనే నిక్‌నేమ్ పెట్టారు పిల్లలు. ఎప్పుడూ బ్రాహ్మణుల పిల్లలు లేదా కమ్మ, రెడ్డి కులాలకు చెందిన పిల్లలు క్లాసులో ముందంజలో ఉండేవాళ్లు. కాలంలో ఇప్పుడు మార్పు వచ్చింది. చదువుకొనే ఆడపిల్లలు పెరిగారు. అందరూ పంజాబీ డ్రెస్సుల్లోనే కనపడతారు. ఆ రోజు సత్యభామ. ఇవాళ వరూధిని. రాజ్యలక్ష్మి స్థానంలో ఆషా.

ఈ గ్రామీణ కళాశాల క్లాసుల్లో పిల్లలు కులాల వారీగా విడివిడిగా కూర్చోవటం కూడా నాకు గిట్టని సంగతి. అప్పట్లో క్లాసుకి ఒకళ్లిద్దరు ముస్లిం పిల్లలు, నలుగురైదుగురు అట్టడుగు వర్గాల పిల్లలు ఉండేవాళ్లు. 'కులము గల్గువారు' వాళ్లని హేళన చెయ్యటమూ మామూలే. కాని బీదరికం నుంచి, తరతరాలుగా అణగారిపోయిన తనం నుంచి ఒక్కొక్క మెట్టుగా వాళ్లు పైకి రావటం సామాజిక స్పృహ గల ఏ అధ్యాపకుడైనా ఆహ్వానించి తీరాల్సిందే.

*'ఉర్వి వారికెల్ల ఒక్క కంచము బెట్టి*
*పొత్తు గుడిపి, కులము పొలియ జేసి*
*తలను చెయ్యిపెట్టి తగ నమ్మ జెప్పరా'*

- నాకెంతో యిష్టమైన ఈ వేమన పద్యం ఎన్నిసార్లు క్లాసుల్లో చెప్పానో. ఇంతకన్న మించిన వసుధైక భావన ఏ ప్రాచీన కవీ చెయ్యలేదు. కులం, గోత్రం గలవాళ్లు, విద్యతో విర్రవీగే వాళ్లు 'పసిడి గల్గువాని బానిసకొడుకులు' అని కూడా అన్నాడు గదా కవి?

❖ ❖ ❖

"ఇదుగో దాదా సాయిబూ! అట్ల గాదు గానీ ఉంకో నికరమైన మాటజెప్పు"

వరండాలో నులకమంచం మీద కూర్చున్న నాన్న మాటలు. చిన్నప్పటి దృశ్యం. ఎదురుగా పందిరికింద దాదా సాయిబు నిలబడి వున్నాడు. మొహంమీద స్ఫోటకం మచ్చలు. కోల మొహం. కుదిమట్టంగా ఉన్న ఆకారం. ఒక కాలు పొట్టి. వంకరగా నిలబడి బతిమిలాడుతున్నాడు.

"కాదన్నయ్యా! ఈ ఒక్కసారికి వొదిలెయ్యి. చిన్న పిల్ల నిఖా దగ్గర బడింది. ఇప్పుడు డబ్బులంటే నావల్ల అయ్యేది గాదు. వచ్చే పంటల్లో నీ బాకీ చుప్తాగా దీర్చేస్తాగా. నా మాట నమ్ము."

రెండు వేలు బాకీ, ఎప్పుడో తీసుకున్నది. అదుగో, ఇదుగో అంటమే గాని తీర్చేది లేదు. ఇప్పుడు  పట్టుబట్టాడు నాన. దాదా సాయిబు సోమరిపోతు గాదు. కుంటికాలుతోనే కుట్టు మిషను కుడతాడు. నా చొక్కాలు, నిక్కర్లు, నాన చొక్కాలు కుట్టేది అతనే. ఆడవాళ్లు పొలం కూలి పనులకు పోతారు. నాకిష్టమైనట్టు పెద్ద పెద్ద జేబుల్తో, చొక్కాలు కుట్టి సరిగ్గా పండగ ముందు అందించే దాదా సాయిబంటే నాకిష్టం, 'అమ్మా! అవి కుట్టి బాకీ తీరుస్తాడు గదా!' అంటే అమ్మ నవ్వి 'ఎన్ని చొక్కాలు కుడితే అంత బాకీ తీరుద్దిరా?' అంది.

నాన దగ్గిర సరే ననిపించుకొని వెళ్లాడు దాదా సాయిబు. బాకీ ఎప్పుడు తీర్చాడో నాకు తెలీదు. వాళ్ల పెళ్లిల్లప్పుడు, పీర్ల పండగలప్పుడు నాన్నని పిలిచేవాళ్లు. పీర్లు, గుండం తొక్కటం- ఇవన్నీ విచిత్రంగా అనిపించేవి నాకు. 'వాళ్లది ఎదురు మతంలే' అనేది అమ్మ. అయితే దాదా సాయిబు, మస్తాన్ సాయిబు, అత్తరు సాయిబు - వీళ్లు గాని, రైతులం మేమంతా గాని ఊళ్లో ఒకే కుటుంబంలాగా మెలిగేవాళ్లం. వాళ్లల్లో ఒక్క మస్తాన్ సాయిబు కొడుకు ఈసఫే మాతోపాటు కొంత వానాకాలం చదువు చదివాడు. తర్వాత సైకిల్ రిపేరు షాపు. ఆ తర్వాత తండ్రికి మల్లే చిల్లర కొట్టు. అంతేగాని మా కారులో మా ఊళ్లో చదువుకున్న ముస్లింలు లేరు. హైస్కూల్లో క్లాస్ మేట్ జానీ ఉండేవాడు. తెలివైనవాడు. బాల్ బాడ్ మింటన్, రైట్ బాక్ బాగా ఆడే వాడు. అప్పుడు మా టీమ్ హైస్కూల్ జోనల్ పోటీల్లో గెలిచి, ఛాంపియన్ అయ్యింది. తర్వాత జానీ చదువు మానేసి బట్టలకొట్టు పెట్టాడు. రాజ్యలక్ష్మి బాచ్‌లో ఒకే ఒక్కరు ముస్లిం. ఇవాళ క్లాసుకి కనీసం ఐదారుగురు. చదువులో వాళ్లకి సాయపడే స్వచ్ఛంద సంస్థలున్నాయి. మరోవైపు చితికి పోయిన బ్రాహ్మణకుటుంబాల నుంచి చేరుతున్న పిల్లలూ ఉన్నారు. ఇక మోతుబరి రైతు కుటుంబాల పిల్లలు పట్నాల వైపు ఖరీదైన కార్పొరేట్ చదువుల కోసం పరుగులు తీస్తున్నారు.

❖ ❖ ❖

మనుషులకి కులమతాలు గుర్తు చేసి, ద్వేషాలు పెంచటానికే గదా ఎన్నికలున్నాయి? పంచాయతీ ఎన్నికల్లో కమ్మ, రెడ్డి - రెండు వర్గాలు ఢీకొన్నాయి. రెండిటికీ సమానబలం ఉంది.

ఇక ముస్లిం ఓటర్లు ఎటు మొగ్గితే అటే గెలుపు ఖాయం. ఊళ్లో ఉద్రేకాలు పెరుగుతున్నాయి. లేని పోని గొడవల్లో తలదూర్చవద్దని విద్యార్థులకి చెప్పాం. ఎన్నిక ముగియగానే ఒక వర్గం ముస్లింల మీద కర్రల్తో దాడి చేసింది. కేకలు, కొట్లాటలు, గాయాలు. పోలీసులు వెంటపడగానే తలో ఒక దిక్కు చెల్లాచెదురయ్యారు. ఊరుకానుకొని వున్న కాలేజీ మాది. ఊళ్లో వార్తలు ఆఘమేఘాల మీద కాలేజీకి చేరాయి. ముందు జాగ్రత్తగా వెంటనే కాలేజీ మూసేసి, పిల్లలందరిని ఇళ్లకు వెళ్లిపొమ్మన్నాం. ఇంతలో ఆషా వచ్చింది బిక్కు బిక్కుమంటూ.

"సార్! వాళ్లు మా ఇంటిమీదకీ వచ్చారంట. బాబా వాళ్లు ఎటు వెళ్లారో? ఊళ్లోకెళ్లటానికి భయంగా ఉంది సార్!"

నాకేం పాలు పోలేదు. స్టాఫ్ అంతా ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోతున్నారు. ఒక అమాయక బాలిక సంగతి ఆ గొడవలో ఎవరికి పడుతుంది? నేనొక నిర్ణయానికి వచ్చాను. ఆషా వాళ్లింటికి కబురు చెప్పమని ప్యూన్‌కి చెప్పాను. తనను స్కూటర్ మీద ఎక్కించుకొని, మా ఊరు తీసికెళ్లాను. శ్రీమతికి, పిల్లలకి పరిచయం చేసి, సంగతి వివరించాను.

"పోనీ లెండి, మంచిపని చేశారు." అంది కమల, ఆషాను దగ్గిరికి తీసుకుంటూ.

ఆషాకి దిగులుపడొద్దని, రెండు మూడు రోజుల్లో అంతా సర్దుకుంటుందని చెప్పాను. "నువ్విప్పుడు మా పెద్దమ్మాయివి. ఏ అరమరిక లేకుండా మీ యింట్లో మాదిరే ఉండు."

పదో తరగతి చదువుతున్న పవన్ ఆషా వంక విచిత్రంగా చూశాడు. ఆ చూపుల అర్థం తర్వాత వాడు తల్లితో అంటున్న మాటల్లో తెలిసింది.

"అమా! నాన్నేందే ఎదురు మతం వాళ్లని ఇంటికే తెస్తున్నాడు?"

ఏడో తరగతి చదువుతున్న వరుణ్ మాత్రం ఆషాతో బాగా కలిసిపోయాడు. తర్వాత పవన్ ని విడిగా పిలిచి, కులమతాల కన్న మంచిచెడ్డలే ప్రమాణమని నెమ్మదిగా చెప్పాను. వాడు సరిగానే గ్రహించాడనిపించింది.

ఆషా వాళ్ల ఇంటికి కబురు చేశాను, తను మా ఇంట్లో ఉందని, ఏమీ కంగారు పడనక్కర్లేదని. ఆషా ఉన్న రెండు రోజులూ ఇంట్లో వాళ్లందరితో బాగా కలిసిపోయింది. పవన్‌కి, వరుణ్‌కి లెక్కలు చెప్పింది. ఇంటి పనులు, వంటపనులు అందుకుంది. "మనకిట్లాంటి కూతురుంటే ఎంత బాగుండేదో, కదండీ?" అంది కమల సంతోషంగా. నిజమేననిపించింది. ఊళ్లో ప్రశాంతత ఏర్పడిన తర్వాత, మూడోరోజు ఆషాను బయల్దేరదీశాను. వరుణ్ తనను వదల్లేక వదిలిపెట్టాడు. పవన్ దొడ్లో జామకాయలు కోసుకొచ్చి ఆషాకిచ్చాడు.

జూనియర్ ఇంటర్ పరీక్షలకి ముందు ఆషా ఒకరోజు కలిసి "ఇంట్లో నన్నింక చదివించనంటున్నారు సార్!" అని చెప్పింది నిరుత్సాహంగా. మొహం కళ తప్పింది. వాళ్ల బాబా లేవలేకుండా ఉన్నాడని, జరుగుబాటు కష్టంగా ఉందని తెలిసింది.

ఆ రోజు సాయంత్రం గుంటూరు వెళ్లాల్సిన వాడిని. ఊళ్లో ఆషా వాళ్లింటికి వెళ్లాను. తూర్పు బజారులో చిన్న గల్లీలో, మురికి కాలవ పక్కన, గాలి, వెలుతురు అంతగా రాని చిన్న పెంకుటిల్లు. రెండే గదులు. పొగ చూరిన పొయ్యి గూడు. దండెం మీద అక్కడక్కడ చిరుగులు పడ్డ దుస్తులు వేలాడుతూ. ఒక మూల కుట్టు మిషన్. మంచంమీద బాషా. నన్ను చూసి చటుక్కున లేచాడు. ఆషా వాళ్లమ్మ, ఫాతిమా బురఖాలో. పక్కనే నిక్కరు వేసుకున్న పిల్లాడు. సాదా సీదా దుస్తుల్లో మరో అమ్మాయి, ఆషా చెల్లెలేమో, నన్ను చూడంగానే నెత్తి మీద చున్నీ సరి చేసుకుంది. ఒక 'గౌరవనీయ వ్యక్తి' తమ బీదయింటికి రావటంతో ఇంట్లో వాళ్లంతా ఆశ్చర్యపోయారు. కూర్చోటానికి ముక్కాలి పీట తప్ప ఏమీలేని యింట్లో నాకేం మర్యాదలు చెయ్యాలో తెలీక, 'యా అల్లా!' అనుకుంటూ కంగారు పడ్డారు. మర్యాదలేమీ అవసరం లేదని చెప్పాను. బాషా పక్కన కూర్చొని అతని ఆరోగ్యం విచారించాను. విపరీతమైన ఆయాసం. అది తగ్గేది కాదు. అంత దరిద్రం ఓడుతున్న ఆ యింట్లో ఆషా వెయ్యికిరణాల దీపంలాగా కన్పించింది నాకు. వాళ్లమ్మ పెట్టిచ్చిన టీ యిచ్చింది ఆషా. బాషాకి చెప్పాను, ఎట్టి పరిస్థితుల్లోను అమ్మాయి చదువు మాన్పించవద్దని. ఫీజుల సంగతి నేను చూసుకుంటానన్నాను. వాళ్ల సంతోషానికి మేర లేదు. ఇక ఆషా సంగతి చెప్పనక్కర్లేదు.

"బహుత్ బహుత్ షుక్రియా సాబ్!" అన్నాడు బాషా సంతోషంగా.

నేను చూపించేది ఔదార్యం కాదని, అది మానవధర్మమే అని చెప్పాను.

మార్చి నెలలోనే పరీక్షలయిపోయాయి. ఇంకా స్పాట్ వాల్యుయేషన్ మొదలు కాలేదు. ఎండా కాలం అప్పుడే తన ప్రతాపం చూపిస్తోంది. కొద్దిగా వడగాలి మొదలైంది. ఇంటిముందు వేపచెట్టు పూత కొచ్చింది. ఉగాది ముందు శనివారం. మధ్యాహ్నం పూట ఇంకో ఇద్దరు ఆడపిల్లలతో మా యింటి ముందు ప్రత్యక్షమైంది ఆషా.

అనంతారం కొండమీదకి వెళ్లి వస్తున్నారు వాళ్లు. మా వూరికి మైలున్నర దూరంలో ఉంది అనంతారం. లేదా అనంతవరం. అక్కడ కొండమీద చిన్న గుహలాంటి చోట వెలిశాడు అనంతశయనుడు. అంటే వెంకటేశ్వర స్వామి. ఇద్దరు భార్యలతో కలిసి ఉన్నట్టు ఏటవాలుగా ఉన్న కొండ రాయి మీదే చెక్కిన విగ్రహాలుంటాయి. తక్కిన రోజుల్లో పెద్ద సందడి ఉండదు గాని ఉగాది ముందు ఫాల్గుణమాసం నాలుగు శనివారాలూ సందడే సందడి. చుట్టుపక్కల ఊళ్ల భక్తులు కాలి నడకన, ఎడ్లబళ్ల మీద, ట్రాక్టర్ల మీద కోకొల్లలుగా గట్టుకి వస్తారు. అందమైన ప్రభలు తరలి వస్తాయి. అంతా ఒకటే తిరణాల కోలాహలంగా ఉంటుంది. ఏటవాలుగా ఉన్న కొండమెట్ల మీదగా వెళ్లి దేవుడిని దర్శించుకొంటారు.

"కొండ చాలా బాగుంది సార్! కోనేరు కూడా చూశాం. పైనుంచి మన ఊళ్లు, పొలాలు - అన్నీ బలే కనపడుతున్నాయి." సంబరంగా చెప్పింది ఆషా.

"మెట్లన్నీ ఒకే ఊపున ఎక్కేసింది సార్! మేమే వెనకబడ్డాం." చెప్పింది పక్కనే అమ్మాయి.

"కొండ మీదకి మొత్తం 366 మెట్లున్నాయి సార్! కష్టపడి లెక్కేశాను." అంది ఆషా.

"ఇంకో మెట్టుండాలే? మొత్తం 367 గదా?" అన్నాను నేను.

చిన్నప్పుడు సావాసగాళ్లతో కలిసి బుల్లి బుల్లి ప్రభలు గట్టుకొని గట్టు దగ్గిరకి వెళ్లిన సన్నివేశాలు గుర్తొచ్చాయి. నేనూ అట్లాగే ఒకే ఊపున కొండెక్కేవాణ్ణి.

"అయితే మా దేవుడి దగ్గిరకెళ్లొస్తున్నావా?" అడిగాడు ఇదంతా పక్కనే వింటున్న పవన్.

"నాకా తేడాలేం తెలీవు" అంది ఆషా.

"తెలీకపోటమే మంచిది" అన్నాను నేను.

❖ ❖ ❖

జూన్ నెల. కాలేజీ తెరిచారు. ఆ రోజు రీసెస్‌లో ఇద్దరు పాత విద్యార్థులు వచ్చారు, మర్యాదగా కలవటానికి. కాలేజీ అంతా తిరిగారు. మాటల మధ్య "సార్! మేం చదువుకున్నప్పటికి, ఇప్పటికి చానా మార్పొచ్చింది. పిల్లలు టౌన్ చదువులకెగబడుతున్నారు గదా?" అన్నారు.

"అవును. కార్పొరేట్ మహిమ. విద్యని వ్యాపారం చేసిన ఘనత కార్పొరేట్, రెసిడెన్షియల్ కళాశాలలకే చెందుతుంది. ఈ పాపంలో సగభాగం ప్రభుత్వానిదే." అని చెప్పాను, గ్రౌండులో నడుస్తూ. "ఇప్పుడీ ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కాలేజీల్లో వెనకబడిన వర్గాలు, కులాల విద్యార్థులు ఎక్కువయ్యారు. సామాజిక సౌభాగ్యంలో తమ భాగం కోసం వాళ్లు తపన పడుతున్నారు. అది విద్యారంగంలో స్పష్టంగా కనపడుతుంది. చాలా మంచి మార్పు. దీన్ని మనం ఆహ్వానించాలి."

అట్లా చెపుతూనే ఆలోచనలో పడ్డాను. నిజానికి ఈ మార్పు 20వ శతాబ్ది ప్రారంభంలో మొదలైందేమో. అప్పటి అగ్రవర్ణాల్ని పోషించిన రాజులు, జమీందార్లు అంతరించారు. కష్టించే వాడికే ఫలితం. దాంతో భూమిని నమ్ముకున్న వర్గాలు (కమ్మ, రెడ్డి, వెలమ మొ.) సమాజం నిచ్చెనమెట్లలో పై వరస కెక్కాయి. విద్యల్లోకి వచ్చాయి. ఆ వరసలోనే నేనున్నాను. నా ముందు, నా తరంలో కొన్ని మార్పులు జరిగాయి. మా ఊరునుంచి ప్రతి రోజు రానుపోను ఆరేడు మైళ్లు నడిచి, వాగులు, వంకలు, బీళ్లు దాటుకుంటూ హైస్కూలుకి వెళ్లి చదువుకున్న రోజులవి. అగ్రవర్ణస్థులతో పోటీ పడి, యూనివర్సిటీ ఫస్టులు సాధించిన రోజులు. ఇట్లా శూద్రులు కూడా చదువుసంధ్యల్లో, సామాజిక రాజకీయరంగాల్లో తామేమిటో నిరూపించుకోగలిగారు. ఇప్పుడు నా కళ్లముందే మరెన్నో మార్పులు వస్తున్నాయి. నా కన్న, పాత అగ్రకుల విద్యార్థులకన్న ఇంకా అట్టడుగువాళ్లు గూడా విద్యాఫలాలు అందుకొనే రోజులివి. ఇవాళ జ్ఞానం, ఏ వర్ణం లేదా వర్గం సొత్తు కాదు. అది అందరిది. ఈ మాట నిరూపించటానికి 'ఆషా' అనే ఒక్క అమ్మాయి చాలు.

బెల్లు కొట్టారు. క్లాసుకి వెళ్లాలి. ఆషా కొత్త పాఠం చదువుతుంది. నా శిష్యురాలు ఆషా, ఇవాళ నా కథానాయిక.